మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఆయన నివాసంలో వరంగల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య మంగళవారం కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్ పొలం బాట

- నీళ్లు లేక ఎండిపోయిన పంటల పరిశీలన
- కష్టాల్లో ఉన్న రైతులకు అండగా బీఆర్ఎస్
- త్వరలో నల్లగొండ జిల్లా నుంచి ప్రారంభం

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు కష్టాల్లో ఉన్న రైతులకు అండగా నిలిచేందుకు, వారిలో మనో ధైర్యం నింపేందుకు పొలం బాట పట్టనున్నారు. ఇటీవల నీళ్లు లేక ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు. ఏప్రిల్ మొదటివారంలో నల్లగొండ జిల్లా నుంచి ఈ యాత్ర ప్రారంభించనున్నట్టు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉత్పన్నమైన నీటి ఎద్దడి సమస్య కారణంగా రాష్ట్రంలోని దాదాపు 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయనే అంచనాలు ఉన్నాయి. ఒకవైపు సాగునీరు అందక చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే, మరోవైపు ఇటీవల కురిసిన వడగండ్ల వానలతో లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పంట నష్టాన్ని అంచనా వేసేందుకు బీఆర్ఎస్ నేతలు మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంట పొలాల సందర్శన కార్యక్రమం చేపట్టగా, కేసీఆర్ కూడా స్వయంగా రైతుల వద్దకు వెళ్లనున్నట్టు సమాచారం. ఏప్రిల్ మొదటి వారంలో ఈ పర్యటనలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నదని పార్టీ వర్గాలు తెలిపాయి. తొలుత ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యటించేవిధంగా పార్టీ నేతలు ప్రణాళికలు రచిస్తున్నట్టు తెలిసింది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కేసీఆర్ యాత్ర మొదలు పెట్టనున్నారు. అక్కడి నుంచి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాన్ని చుట్టివచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో కేసీఆర్ పర్యటన కోసం అక్కడి నేతలు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు. తేదీలపై ఒక ట్రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని సమాచారం.

ఆర్థికంగా చితికిపోతున్న రైతన్న

పదేండ్ల కేసీఆర్ పాలనలో ఏనాడూ ఒక్క ఎకరం కూడా ఎండిపోలేదని, నీళ్లు, కరెంటు కావాల్సినంత అందుబాటులో ఉండేదని బీఆర్ఎస్ కార్యకర్తలు గుర్తుచేసుకుంటున్నారు. కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలోనే దాదాపు 20 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు ఎవ్వరూ స్వయంగా పంట నష్టాన్ని పరిశీలించి, భరోసా కల్పించడం లేదన్న ఆవేదన రైతుల్లో గూడు కట్టుకున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయంగా గేట్లు ఎత్తడంపైనే దృష్టి పెడుతున్నారని, ప్రాజెక్టు గేట్లు ఎత్తడం, నీటి నిర్వహణపై దృష్టి పెట్టడంలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఎండిపోయిన పొలాలు, వడగండ్ల వర్షాలకు నష్టపోయిన పొలాలకు ఎకరాకు 25 వేల చొప్పున నష్టపరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు కొత్తగా బోర్లు వేసుకుంటున్నారని, అవి సక్సెస్ కాకపోవడంతో ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రైతులు అప్పుల పాలవుతున్నారు. కరెంటు ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియడంలేదని, మోటర్లు కాలిపోతున్నాయని, ఇది మరో రకంగా రైతులకు భారంగా మారుతున్నదని, ఈ దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని బీఆర్ఎస్ ఆరోపిస్తున్నది. రైతులకు మనోధైర్యం కల్పించడానికి, వారికి భరోసా ఇవ్వడానికి కేసీఆర్ రంగంలోకి దిగిస్వయంగా రైతుల వద్దకు వెళ్లనున్నారు. ఆత్మహత్యలకు పాల్పడవద్దని, తమ పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వంపై పోరాడుతుందని ధైర్యం నింపనున్నారు. ప్రభుత్వం స్పందించకుంటే 'చలో సచివాలయం' పిలుపునివ్వాలని నిర్ణయించారు.

లోకం పోకడ



మీరిచ్చే హామీలు ఆ సిన్మాయాక్టర్లు నటించబోయే సిన్మాపాత్రల ద్వారా అమలు చేస్తారా? అనడుగుతున్నాడు సార్!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	40.5°c	20.0°c
రంగారెడ్డి	40.5°c	19.2°c
మెదక్	39.9°c	20.4°c
ఖమ్మం	39.0°c	23.0°c
నిజామాబాద్	38.6°c	24.7°c
నల్లగొండ	38.5°c	23.0°c
హైదరాబాద్	38.2°c	24.5°c
మహబూబ్‌నగర్	38.0°c	25.6°c
వరంగల్	37.0°c	24.0°c
కరీంనగర్	37.0°c	25.0°c

హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యేలు గోపీనాథ్, వెంకటేశ్, గోపాల్, ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, నేతలు దాసోజు శ్రవణ్, శ్రీధర్‌రెడ్డి, నగేశ్, గోవర్ధన్‌రెడ్డి, విప్లవకుమార్ తదితరులు

2,500 కోట్లు ఢిల్లీకి!

బిల్డర్లను రేవంత్ బెదిరిస్తూ పైసలు వసూలు చేస్తున్నడు • బిల్డింగులకు 3 నెలలుగా అనుమతుల్లేవ్.. డబ్బిస్తేనే పర్మిషన్లు

మంత్రుల ఇసుక దందాలు, రైస్‌మిల్లర్లకు బ్లాక్‌మెయిలింగులు

లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీలో చేరే తొలివ్యక్తి రేవంతే

- ప్రతిపక్షాలను అరెస్టు చేసేపనిలో ప్రధాని.. ప్రమాదంలో దేశం
- మోదీని నిలువరించడం కేసీఆర్, కేజ్రీవాల్, మమతకే సాధ్యం
- ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేయాలి.. బాధ్యులను శిక్షించాలి
- రేవంత్‌రెడ్డికి భయపడేవారు లేరు.. వెంట్రుక కూడా పీకలేడు
- దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి నలభై సీట్లు కూడా దాటవు
- సికింద్రాబాద్ లోక్‌సభ సన్నాహక సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి బిల్డర్లు, రియల్టర్లను బెదిరించి డబ్బులు వసూలు చేసి రూ.2,500 కోట్లు ఢిల్లీకి పంపించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. మున్సిపల్ మంత్రిగానూ ఉన్న రేవంత్.. మూడు నెలలుగా బిల్డింగులకు ఎందుకు అనుమతులు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. పైసలిస్తేనే అనుమతులు ఇస్తామంటున్నారని విమర్శించారు. ఈ బెదిరింపుల వార్తలు బయటకు రాకుండా ఫోన్‌ట్యాపింగ్, స్కాములు అంటూ టీవీల్లో ఆ వార్తలను రాయించుకుంటున్నారని చెప్పారు. ఇసుక స్కాంలో ఒక మంత్రి, రైస్‌మిల్లర్లను ఇంకో మంత్రి బెదిరిస్తున్నారని అన్నారు. మంగళవారం తెలంగాణభవన్‌లో హైదరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అధ్యక్షతన సికింద్రాబాద్ పార్లమెంటరీ స్థాయి పార్టీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడిన కేటీఆర్.. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీలో చేరే మొదటి వ్యక్తి రేవంత్‌రెడ్డేనని తెలిపారు. ఇక్కడ రేవంత్ బీజేపీ పాట పాడుతున్నారని, కాంగ్రెస్‌కు దేశవ్యాప్తంగా 40 సీట్లు దాటవని ఎద్దేవా చేశారు. 'ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేయాలి. నీ అధికారం ఉంది కదా. ఏం చేస్తావో చేసుకో. ఎక్కడెక్కడ తప్పులు జరిగినవో, ఎవరెవరు తప్పులు చేశారో వాళ్లపై చర్యలు తీసుకో' అని సీఎంకు స్పష్టం చేశారు. రేవంత్‌కు భయపడే వారెవరూలేరని, వెంట్రుక కూడా పీకలేరని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ ప్రతిపక్షాలను అరెస్టు చేసేపనిలో ఉన్నారని, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

సికింద్రాబాద్ అంటే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్‌లో పోటీ ఒక విఫల ఎంపీ కిషన్ రెడ్డి, అవకాశవాద ఎమ్మెల్యే దానం నాగేందర్, నిబద్ధత కలిగిన పద్మారావుగౌడ్ మధ్య ఉన్నదని కేటీఆర్ అన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభలో ఇంతవరకు బీఆర్ఎస్ గెలవలేదని, ఈసారి పద్మారావుగౌడ్ అభ్యర్థిగా విజయం సాధించబోతున్నామని తెలిపారు. కష్ట కాలంలో పార్టీ వెంట ఉన్నవారే నిజమైన కార్యకర్త అని తేల్చిచెప్పారు. రాజకీయాల్లో సికింద్రాబాద్ అంటే గుర్తుకొచ్చే పేరు పద్మారావుగౌడ్ అని. 24 ఏండ్ల నుంచి పార్టీకి నగరంలో అండగా ఉన్నారని వెల్లడించారు. ఆయన పోటీ చేస్తున్నారని అనగానే పార్టీ గెలుస్తుందని అందరూ చెప్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో 11.50 లక్షల కుటుంబాలకు ఉచితంగా తాగునీటిని ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బిల్లులు వసూలు చేస్తున్నదని విమర్శించారు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అని ఇప్పుడు కండీషన్లు పెడుతున్నదని ఆరోపించారు.

త్వరలో ఉపఎన్నిక

దానం నాగేందర్ పార్టీని వదిలిపోయారని, రాజకీయాల్లో హత్యలుండవు, ఆత్మహత్యలే ఉంటాయని కేటీఆర్ అన్నారు. ఆయన నిర్ణయం తప్పు అని ఎన్నికల్లో గెలిచి మనం చూపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారం కోసం ఆశపడి, గెలిపించిన ప్రజలకు వెన్నుపోటు పొడిచి ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్లారని తెలిపారు. దానం నాగేందర్‌పై స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని, అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టుకు వెళ్లి మరీ అనర్హుడిగా ప్రకటించేలా చేస్తామని స్పష్టం చేశారు. మూడు, నాలుగు నెలల్లోనే ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక వస్తుందని, దానికి సిద్ధంగా ఉండాలని, ద్రోహం చేసిన వారికి బుద్ధి చెప్పాలని అన్నారు.

రాముడి పేరుతో బీజేపీ నాటకాలు

రాముని పేరుతో బీజేపీ ఆడుతున్న నాటకాలను అందరు గమనించాలని కేటీఆర్ కోరారు. ఈడీ, సీబీఐ, ఐటీని అడ్డంపెట్టుకొని శిఖండి రాజకీయం చేస్తున్నదని మండిపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఓడగొట్టి బీజేపీకి మనం సందేశాన్ని ఇవ్వాలని పిలుపునిచ్చారు. గతంలో అంబర్‌పేటలో ఓడిపోతే అదృష్టవశాత్తు కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ ఎంపీ అయ్యారని విమర్శించారు. కురుకురే ప్యాకెట్లు పంచడం, సీతాఫల్‌మండీలో రైల్వేలిఫ్ట్ ప్రారంభించడం, సింటెక్స్ ట్యాంకులను ఓపెన్ చేయడమే ఆయన కేంద్రమంత్రిగా చేసిన అతి పెద్ద మూడు పనులు అని ఎద్దేవాచేశారు. సొంత నియోజకవర్గం అంబర్‌పేటలో కేంద్ర నిధులతో కడుతున్న ఫ్లైఓవర్‌ను ఇంకా నాన్చుతూనే ఉన్నారని, తాము మాత్రం 36 ఫ్లైఓవర్లు పూర్తి చేశామని గుర్తుచేశారు. కిషన్‌రెడ్డికి దమ్ముంటే లిక్కర్ విధానంలో ఏముందో కోర్టుకు చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో విద్యుత్తు, నీటికష్టాలు మొదలయ్యాయని చెప్పారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ మోసాన్ని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. పద్మారావుగౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీలు వాణీదేవి, ఎమ్మెస్ ప్రభాకర్, హైదరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గడ్డం నగేశ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, దాసోజు శ్రవణ్‌కుమార్, విప్లవ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

> మోదీ చౌకీదార్ చోర్ అని రాహుల్‌గాంధీ అంటడు..
> అదే మోదీని బడే భాయ్ అని రేవంత్‌రెడ్డి అంటడు..
> అదానీ ఫ్రాడ్ అని, మంచోడుకాదని రాహుల్ అంటడు..
> అదానీ ఫ్రెండని, మంచోడని రేవంత్‌రెడ్డి అంటడు..
> లిక్కర్ విధానంలో స్కామే లేదని రాహుల్ అంటరు..
> లిక్కర్ స్కాం జరిగిందని రేవంత్‌రెడ్డి అంటడు..
> అక్కడ రాహుల్.. ఇక్కడ రేవంత్ ఒక్కమాట మీద లేరు
> \- కేటీఆర్

లంకెబిందెల దొంగ రేవంత్

లంకెబిందెల కోసం దొంగలు తిరుగుతారని సీఎం రేవంత్‌ను ఉద్దేశించి కేటీఆర్ చురక అంటించారు. 'పేగులు మెడలో వేసుకుంటా అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్నోడు మన ముఖ్యమంత్రి. రేవంత్‌రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని జేబుదొంగ లెక్క తిరుగుతున్నడు. కరెంటు, రైతుబంధు, మహిళలకు రూ.2,500, రూ.4వేల పెన్షన్లు ఇయ్యడానికి చేతకాదు. ఇవన్నీ కవర్ చేయటం కోసం ఫోన్ ట్యాపింగ్, స్కాములు అంటూ వార్తలు రాయించుకుంటున్నడు' అని విమర్శించారు. దేశంలో కాంగ్రెస్‌కు బీజేపీని ఆపే దమ్ములేదని కేటీఆర్ తెలిపారు. దేశంలో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలే మోదీని నిలువరిస్తాయని వెల్లడించారు. కేసీఆర్, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ లాంటివారితోనే సాధ్యమని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ పాలనలో అద్భుతంగా హైదరాబాద్ | బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

పదేండ్ల పాలనలో హైదరాబాద్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం అద్భుతంగా అభివృద్ధి చేసిందని బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, ఒక్క రూపాయి కూడా హైదరాబాద్‌కు అదనంగా తీసుకురాలేదని తెలిపారు. కేసీఆర్ వెంట పనిచేసిన తాము ఎన్నో కష్టనష్టాలు ఓర్చుకొని తెలంగాణ సాధించామని గుర్తుచేశారు. కేసీఆర్ చెప్తే సికింద్రాబాద్‌లోనే కాదు ఢిల్లీలోనైనా కొట్లాడే దమ్ము తమకు ఉన్నదని తేల్చిచెప్పారు. అదీ తమకు కేసీఆర్‌పై ఉన్న నమ్మకం అని స్పష్టం చేశారు. అంతపెద్ద తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన తమకు ఈ లోక్‌సభ ఎన్నికలు ఒక లెక్క కాదని అన్నారు. ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీసీలకు అధికంగా సీట్లు కేటాయించిందని వెల్లడించారు.

> "జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్న జేబు దొంగ.. రేవంత్‌రెడ్డి
> లిఫ్ట్ ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. ఆయనో కుర్‌కురేరెడ్డి"
> \- కేటీఆర్

మూడు రోజులు మాడు పగులుడే!

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో వచ్చే మూడు రోజులు భానుడి భగభగలు మరింత పెరుగుతాయని భారత వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నెల 27 నుంచి 29 వరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో విపరీతమైన ఎండలు ఉంటాయని, ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పెరుగవచ్చని తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లిలో ఈ నెల 27న ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు. 28న వేడిగాలులు కొనసాగుతాయని, తూర్పు, దక్షిణ తెలంగాణలోని భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ, మహబూబ్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, మహబూబ్‌నగర్, నారాయణపేట వంటి జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నది. వచ్చే ఐదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నదని తెలిపింది.

రుణమాఫీపై తూచ్!

మొదటిపేజీ తరువాయి...

ఏమవుతుంది? అన్నట్టుగా ఉన్నదీ ప్రశ్న. ఎన్నికల ముందు మాట్లాడినం. హామీ ఇచ్చినం. అప్పటికి రూ.2 లక్షల కోట్ల అప్పే ఉన్నదని చెప్తే వాస్తవమే అనుకున్నం. మేం అధికారంలోకి వచ్చాక చూస్తే రూ.8 లక్షల కోట్లు అని తేలింది. దాని వడ్డీ కట్టేందుకే అప్పు తెస్తున్నం. ఏటా 67 వేల కోట్లు కట్టాల్సి వస్తున్నది' అని అన్నారు. మంత్రి వ్యాఖ్యలను బట్టి రైతులకు రుణమాఫీ లేనట్టేనా? అన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఇప్పటికే.. నిరుద్యోగ భృతి ఇస్తామని తామెప్పుడన్నాం? అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాలుక మడతేశారు. ఎన్నికల ముందు హైదరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్‌లో ఆ పార్టీ అగ్ర నేత ప్రియాంకగాంధీ స్వయంగా నిరుద్యోగ భృతిపై ప్రకటన చేశారు. అధికారంలోకి రాగానే అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. తీరా.. అధికారంలోకి వచ్చాక హామీనే ఇవ్వలేదని భట్టి అసెంబ్లీలోనే ప్రకటించి, దానికి మంగళం పాడారు. ఇక, మంత్రి జూపల్లి వ్యాఖ్యలతో రుణమాఫీకి కూడా మంగళం పాడినట్టేనా? అన్న అనుమానం కలుగుతున్నది.

హరీశ్.. సవాల్‌కు సిద్ధమా?: జూపల్లి

రైతు సమస్యలు, నీటి పారుదల ప్రాజెక్టులు, గత ప్రభుత్వ అవినీతిపై చర్చించేందుకు హరీశ్‌రావు సిద్ధమా? అని మంత్రి జూపల్లి సవాల్ విసిరారు. సమయం, తేదీ, వేదిక ఏదో చెప్పాలని డిమాండ్ చేశారు. అసలు సినిమా ముందుందని వ్యాఖ్యానించారు. 'సచివాలయాన్ని ముట్టడిస్తామని హరీశ్‌రావు అంటున్నారు. గత పదేండ్లలో రాష్ట్ర ఖజానాను బీఆర్ఎస్ నాయకులు ముట్టడించారు. ఇప్పుడు చేసేదేం లేక సచివాలయాన్ని ముట్టడిస్తామని అంటున్నారు. వాళ్లు పాత ప్రాజెక్టుల నిర్వహణను గాలికి వదిలేశారు. కొత్త ప్రాజెక్టులను పూర్తి చేయలేదు. పార్లమెంట్ ఎన్నికల కోసమే హరీశ్‌రావు మాట్లాడుతున్నారు. వాళ్ల అనాలోచిత నిర్ణయాల వల్లే రాష్ట్రంలో ఇవాళ ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి. అసలు బీఆర్ఎస్ నాయకులకు రైతుల గురించి, వ్యవసాయం గురించి మాట్లాడే నైతిక హక్కు ఉన్నదా?' అని ప్రశ్నించారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. పంట నష్టంపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించామని వెల్లడించారు. నివేదిక అందగానే రైతులకు ఎకరానికి రూ.10 వేల నష్టపరిహారం చెల్లిస్తామని వివరించారు. అన్నదాతల కష్టాలు, కడగండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వ పాపమేనని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతు ఆత్మహత్యలు ఆగలేదని చెప్పారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపడతామని చెప్పి, సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేయలేదని విమర్శించారు. నీటి పారుదల ప్రాజెక్టులే కాదు.. ఏ ఒక్క హామీని బీఆర్ఎస్ సర్కారు నెరవేర్చలేకపోయిందని ఆరోపించారు.

ఇది పొలిటికల్ లాండరింగ్ కేసు

కడిగిన ముత్యంలా బయటకు వస్తా.. • రౌస్ అవెన్యూ కోర్టు ఆవరణలో మీడియాతో ఎమ్మెల్సీ కవిత

- 9 వరకు జ్యుడీషియల్ రిమాండ్
- వెసులుబాట్లు కల్పించాలని ఆదేశం
- మధ్యంతర బెయిల్‌పై 1న విచారణ

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): రాజకీయ కుట్రతోనే తనపై తప్పుడు కేసు పెట్టారని, ఇది మనీలాండరింగ్ కేసు కాదని, పొలిటికల్ లాండరింగ్ కేసు అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ కేసు నుంచి తాను కడిగిన ముత్యంలా బయటకు వస్తానని ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం తనను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపుతున్న సమయంలో రౌస్ అవెన్యూ కోర్టు ఆవరణలో ఉన్న మీడియా ప్రతినిధులతో కవిత మాట్లాడారు. ఇప్పుడు తాత్కాలికంగా జైల్లో పెట్టవచ్చుని, కానీ, తన ఆత్మస్థైర్యాన్ని మాత్రం దెబ్బతీయలేరని పేర్కొన్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక వ్యక్తి బీజేపీలో చేరాడని, మరో వ్యక్తి బీజేపీ కూటమి నుంచి పోటీచేస్తున్నాడని, ఇంకో వ్యక్తి బీజేపీకి రూ.50 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లు కొన్నాడని చెప్పారు. ఇది కట్టుకథలతో పెట్టిన తప్పుడు కేసు.. ఇది అక్రమ కేసు అని, దీనిపై పోరాటం చేస్తానని స్పష్టంచేశారు.

9 వరకు జ్యుడీషియల్ రిమాండ్

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఏప్రిల్ 9 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ రౌస్ అవెన్యూలోని సీబీఐ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. మనీలాండరింగ్ ఆరోపణలపై ఈ నెల 15న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కవితను అరెస్టు చేయగా, కోర్టు ఆమెకు విధించిన పది రోజుల ఈడీ కస్టడీ మంగళవారంతో ముగిసింది. దీంతో ఉదయం ఆమెను ఈడీ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా తమ విచారణ ఇంకా పూర్తికాలేదని, కేసు దర్యాప్తు పురోగతిలో ఉన్నదని, ఇంకా కొంతమంది నిందితులను ప్రశ్నించాల్సి ఉన్నదని ఈడీ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. కవితను 15 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి పంపించాలని కోరారు. ఈడీ వాదనలు విన్న న్యాయస్థానం కవితను 14 రోజులపాటు ఏప్రిల్ 9 వరకు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ కవితను తీహార్ జైలుకు తరలించారు. ఆమెకు జైలులో కొన్ని వెసులుబాట్లు కల్పించాలని జైలు సూపరింటెండెంట్‌కు న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. పుస్తకాలు, పెన్ను, పేపర్లు, మందులు, ఆభరణాలు తీసుకోవడానికి, ఇంటి నుంచి భోజనం తెప్పించుకోవడానికి, పడుకోవడానికి మంచం, దుప్పట్లు, చెప్పులు వంటివి సొంతంగా ఏర్పాటు చేసుకునేందుకు కోర్టు అనుమతించింది. ఇదిలా ఉండగా, కవిత అభ్యర్థన మేరకు తన కుటుంబసభ్యులతో మాట్లాడేందుకు న్యాయస్థానం అనుమతించింది. దీంతో ఆమె కోర్టు హాలు వద్ద భర్త అనిల్, ఇతర కుటుంబసభ్యులతో కాసేపు మాట్లాడారు.



మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై 1న విచారణ

ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్ ఏప్రిల్ 1న విచారణకు రానున్నది. తనకు 16 ఏండ్ల కొడుకు ఉన్నాడని, అతని పరీక్షల షెడ్యూల్ విడుదలైందని, తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత న్యాయస్థానాన్ని కోరారు. తాము రెగ్యులర్ బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేశామని ఈ విషయంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు కూడా ఉన్నాయని కవిత తరఫు న్యాయవాది విక్రంచౌదరి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అయితే, బెయిల్ దరఖాస్తుపై సమాధానం ఇచ్చేందుకు తమకు కొంత సమయం కావాలని ఈడీ తరఫు న్యాయవాదులు కోరారు. దీంతో కవిత దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 1న విచారణ జరుపుతామని, ఆ లోపు ఈడీ సమాధానం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

స్టేట్‌మెంట్లన్నింటినీ భద్రపరచండి

పీఎంఎల్ఏ సెక్షన్ 19(2) ప్రకారం నమోదుచేసిన స్టేట్‌మెంట్లన్నింటినీ భద్రపరచాలని, తమకు కూడా ఒక కాపీ ఇవ్వాలని కవిత తరఫు సీనియర్ న్యాయవాది విక్రంచౌదరి కోరారు. ఇందుకోసం ఒక దరఖాస్తు అందజేయాలని సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా సూచించారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే అటాచ్ చేసిన ఆస్తులను ఖరారు చేస్తూ అడ్జుడికేటింగ్ అథారిటీ ఉత్తర్వులు ఇచ్చిందని న్యాయమూర్తి దృష్టికి ఈడీ తరఫు న్యాయవాది తీసుకెళ్లారు. ఈడీ కస్టడీలో ఉన్నప్పుడు చేసిన అన్నిరకాల వైద్యపరీక్షలకు సంబంధించిన రికార్డులను కూడా కవిత తరఫు న్యాయవాదులకు అందజేయాలని న్యాయస్థానం ఆదేశించింది.

కవితపై తప్పుడు కేసు: ఎంపీ వద్దిరాజు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై తప్పుడు కేసు బనాయించారని, ఆమె నిర్దోషిగా బయటకు వస్తారని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఢిల్లీలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్‌తో కలిసి మాట్లాడారు. రాజకీయ దురుద్దేశంతోనే ఆమెపై కేసుపెట్టి జైలుకు పంపారని విమర్శించారు. కవిత అరెస్ట్‌తో పాటు పార్టీలో నెలకొన్న పరిస్థితులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యూహచతురతతో అధిగమిస్తారని చెప్పారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటామని, కేసులకు, జైళ్లకు భయపడే సమస్యే లేదని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీజేపీ ఇటువంటి కుట్రలకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. బీజేపీ ఎత్తులను తెలంగాణ ప్రజలు చిత్తుచేస్తారని, తమకు ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థపై అపారగౌరవం ఉన్నదని చెప్పారు.